క్లుప్తంగా

కబడ్డీ విజేత సింగుపురం



విజేత జట్టుకు నగదు అందజేస్తున్న సీఐ చంద్రమౌళి

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్ర పంచాయతీ గొదలాం గ్రామంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల విజేతగా సింగుపురం జట్టు నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్‌లో సింగుపురం, మామిడిపల్లి జట్లు తలపడ్డాయి. విజేతగా నిలిచిన సింగుపురం జట్టుకు రూ.20 వేలు నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన మామిడిపల్లి జట్టుకు రూ.15 వేలు, కామన్ థర్డ్‌గా నిలిచిన గొదలాం, కొండపూరు జట్లను రూ.10 వేలు చొప్పున నగదును టెక్కలి సీఐ ఎస్.ఎస్.చంద్రమౌళి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ డీఈఈగా అనంతరావు



కాశీబుగ్గ: పలాస నియోజకవర్గం హౌసింగ్ డీఈఈగా రెడ్డి అనంతరావును ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పలాస నియోజకవర్గంలో ఉన్నటువంటి మందస, వజ్రపుకొత్తూరు, పలాస మండలాలతో పాటు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి డీఈఈగా విధులు నిర్వహించనున్నారు. మన్యం జిల్లాలో విధులు నిర్వహిస్తున్నటువంటి ఆయన సాధారణ బదిలీపై పలాసకు విచ్చేశారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న అభయం సేవా సంఘం సభ్యులు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ ఎన్టీఆర్ కాలనీకు చెందిన లాల్‌పండా కార్తీక్ అనే బాలుడి వైద్యానికి పట్టణానికి చెందిన అభయం యువజన సేవా సంఘం సభ్యులు రూ.38 వేల ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. లాల్‌పండా వెంకట్రావు, శాంతి దంపతుల చిన్న కుమారుడు కార్తీక్‌కు సోజియా అనే అరుదైన వ్యాధి రావడంతో బాలుడి వైద్యానికి తల్లిదండ్రులు ఎంతో శ్రమిస్తున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అభయం యువజన సేవా సంఘం సభ్యులు అండగా నిలిచారు. కార్యక్రమంలో సభ్యులు డి.శ్రీనివాస్, వినోద్, ఎన్.సింహాచలం, రమేష్, కె.నాగరాజు, బి.నాగరాజు, షణ్ముఖ, పూర్ణాచారి, జీవన్, శ్రీను, దుర్గారావు, చంద్రకాంత్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ గ్రామసభలు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మందస: మండలంలోని బెల్లుపటియా, సిద్ధిగాం పంచాయతీల్లో జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టు గ్రామసభలు సోమవారం నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ సురక్షిత తాగునీరు అందించడమే ప్రాజెక్టు ఉద్దేశమని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, సిద్ధిగాం, బెల్లుపటియా సర్పంచ్‌లు గున్న రమణ, అగ్గున్న రమణమ్మ, పంచాయతీ కార్యదర్శులు చంద్రావతి, సహజ, జేజేఎం అధికారులు పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ లైన్‌కు వినతి



ఎంపీపీ దేవదాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కంచిలి: మండలంలోని కుంబరినౌగాం పంచాయతీ పరిధి జిల్లుండ రోడ్డు నుంచి భువనపురం గ్రామం వరకు కొత్త విద్యుత్ లైన్ మంజూరు చేయాలని సర్పంచ్ హరిబంధు జన్ని తదితరులు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీని సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. విద్యుత్ లైన్ లేకపోవడం వలన రాత్రి సమయంలో రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నట్లు తెలియజేశారు. అలాగే కొండమీద ఉన్నటువంటి వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో తవ్విన బోరుకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీపీ హామీ ఇచ్చారు.

డిపాజిట్లు ఇప్పించాలని వినతి

టెక్కలి: సహారా సంస్థ పరిధి టెక్కలి బ్రాంచిలో చేసిన డిపాజిట్లకు కాలం చెల్లినప్పటికీ తిరిగి ఇవ్వడం లేదని దీనిపై అధికారులు స్పందించి తిరిగి తమకు డిపాజిట్లు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన కొంతమంది ఏజెంట్లు సీఐ చంద్రమౌళికి సోమవారం ఫిర్యాదు చేశారు. తక్షణమే తమకు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు.



లక్ష్మీ పూజను తిలకిస్తున్న భక్తులు



లక్ష్మీపూజ జరిపిస్తున్న వేదపండితులు

కనుల పండువగా బ్రహ్మోత్సవాలు



కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు



వాసుదేవస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం



కళాకారులను సన్మానిస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు

● కల్పవృక్ష వాహనంలో స్వామివారు

మందస :

వాసుదేవస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. స్వామివారి కల్యాణం మంగళవారం జరగనుండడంతో ఇప్పటికే భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులతో పాటు వేదపండితులు మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు యాగశాలలో విశేష హోమములు, పారాయణలు, వేదికపై పండితులు, జీయర్‌స్వాముల ఉపన్యాసములు, కల్పవృక్ష వాహనసేవ, లక్ష్మీపూజ కార్యక్రమాలు జరిగాయి. కళాకారులు పిరియా నర్సింగరావు, గార ఆనంద్, పొందల శ్రీనివాస్, మాధవరావు, ఎల్.రాంబాబు, కేశవ సాయి శాస్త్రీయ సంగీత విభావరిలో కీర్తనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. శివసాయి నృత్య కళానికేతన్ కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శనకు భక్తులు ముగ్ధులయ్యారు. సాయంత్రం 6 గంటలకు హంస వాహన, గజ వాహన సేవలు, ఎదుర్కోలు ఉత్సవం ఘనంగా జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు.

బ్రహ్మోత్సవాలకు తరలివస్తున్న భక్తజనులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళాకారులు, ఆధ్యాత్మికవేత్తలను ఆలయం తరుపున దాసుకూర్మాచార్యులు, కొర్ల కన్నారావు, శానాపతి కిషోర్‌కుమార్, జల్లు కాళీచరణ్, దేవరశెట్టి మార్కండేయులు, తిరుపతిరావు, కుశరాజు తదితరులు ఘనంగా సన్మానించారు. శ్రీదేవి, భూదేవి సహిత వాసుదేవుని కల్యాణానికి సర్వం సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



మందస చేరుకున్న త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి, త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఇచ్ఛాపురం రూరల్: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని గిన్ని హరిప్రియ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ జి.కామరాజు అన్నారు. మండలంలోని లొద్దపుట్టి ఉన్నత పాఠశాలలో 2021–22 సంవత్సరం పదో తరగతి పరీక్షలో 500పైబడి మార్కులు సాధించిన విద్యార్థులకు తమ ట్రస్ట్ తరుపున షీల్డుతో పాటు ప్రశంసా పత్రాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన నాడు–నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలు మాదిరిగా కనిపిస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గొర్లె తిరుమలరావు, లక్ష్మీభాయి, హేమంతరావు, సమిత, మురళీధర్, కామరాజు, ధర్మాసాహూ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో పూజలు



ఇచ్ఛాపురం: పూజలందుకుంటున్న స్వేచ్ఛావతి అమ్మవారు

ఇచ్ఛాపురం: పట్టణంలోని గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో కుంభ సంక్రమణ పూజలను భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. అమ్మవారికి తైల మర్దన, సింధూర మర్దన, కుంకుమ పూజ వంటి ప్రత్యేక కార్యక్రమాలు గోపీనాథ్ రెడ్డి దంపతులు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు.

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్య దైవం కవిటి చింతామణి అమ్మవారితో పాటు మండలంలోని వివిధ గ్రామాల గ్రామదేవతల ఆలయాల్లో సోమవారం కుంభ సంక్రమణం పూజలు వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భక్తులు అమ్మవారికి లలితా సహస్రనామసహిత సామూహిక కుంకుమార్చనలు, సామూహిక అన్నదాన కార్యక్రమాలు పెద్దసంఖ్యలో నిర్వహించారు.



కవిటి: పూజలందుకుంటున్న చింతామణి అమ్మవారు

నేటి నుంచి శివరాత్రి మహోత్సవాలు

సంతబొమ్మాళి: మండలంలోని కాపుగోదాయవలసలో మంగళవారం నుంచి మహా శివరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రామస్తులు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తిరువీధి, శివపార్వతుల కల్యాణం, ఆధ్యాత్మిక ప్రవచనాలు, అన్నదానం, కూచిపూడి, భరతనాట్యం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గ స్థాయి కబడ్డీ, డాన్స్ పోటీలు నిర్వహించబడతాయని తెలియజేశారు. ఆసక్తి ఉన్నవారు 91824 90791, 63029 48946 నంబర్లను సంప్రదించాలని కోరారు.

18వ తేదీ నుంచి జాతర

కోటబొమ్మాళి: మండలంలోని దంత గ్రామంలో ఉమా మహేశ్వరస్వామి ఆలయం వద్ద ఈనెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మహా శివరాత్రి జాతర నిర్వహించనున్నట్లు సర్పంచ్ గొండు చాందిని సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో రానున్నందున తగు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

మహా శివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు

కంచిలి: మండలంలోని మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమం ఆవరణలో మహా శివరాత్రి రోజున ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆశ్రమం నిర్వాహకులు గుళ్ల రమేష్, మోహనరావులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 6 గంటలకు గణపతి పూజతో ప్రారంభించి, ఉదయం 9 గంటల నుంచి మహాపూర్ణాహుతి, అనంతరం బిల్వార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రోజంతా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తులంతా విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

హర్షణీయం



గజ్జెల మాధవరావు

కంచిలి: సగర కులానికి చెందిన కర్నాటి రాంబాబుకు విజయవాడ కనక దుర్గమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పదవిని కేటాయించడం హర్షణీయమని సగర సంఘం రాష్ట్ర కార్యదర్శి గజ్జెల మాధవరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సగర కులస్తులకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

బాధితునికి సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డు సూదికొండ గ్రామానికి చెందిన బొంతల తవిటిరాజు ఇటీవల ప్రమాదంలో గాయపడడంతో కాలు విరిగిపోయింది. కాలుకి శస్త్రచికిత్స జరగగా నడవలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యాడు. దీంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న 19వ వార్డు కౌన్సిలర్ శిష్టు బృందావతి, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి శిష్టు గోపి రూ.6 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే 2వ వార్డు కౌన్సిలర్ బడగల సుజాత, వార్డు ఇన్‌చార్జి బడగల బళ్లయ్య నాయుడు 2 నెలలకు సరిపడే నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు తోట సిమ్మయ్య, యువకులు మాణిక్యం, సారధి, మార్పు చిన్న, తోట రాము, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

కో–కన్వీనర్‌గా నరేష్

టెక్కలి: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా టెక్కలి మండలం కో–కన్వీనర్‌గా పరశురాంపురం గ్రామానికి చెందిన కోరాడ నరేష్‌ను నియమించినట్లు ఎమ్మెల్సీ కార్యాలయ సిబ్బంది సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కెల్లి నాగేంద్రకు బదులుగా నరేష్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న రాజయోగిని బీకే లత

కవిటి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాజయోగిని బ్రహ్మకుమారి వరలక్ష్మీ అన్నారు. స్థానిక బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విద్యాలయంలో ముందస్తుగా మహా శివరాత్రి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన రాజయోగిని బీకే లత ఆధ్యాత్మిక ప్రసంగం ఆకట్టుకుంది.

పార్టీ బలోపేతానికి కృషి

ఇచ్ఛాపురం: గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలంతా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ సూచించారు. పట్టణంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో బూత్‌స్థాయి కమిటీలతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆశ్రమ వ్యవస్థాపకులు రామానంద స్వామి, మహిళా మోర్చ నాయకురాలు లక్ష్మి, సాలిన డిల్లి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలి



సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డికి సమస్యలు వివరిస్తున్న పేరాడ తిలక్ తదితరులు

● సబ్ కలెక్టర్‌కు విన్నవించిన పేరాడ తిలక్

టెక్కలి: ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాన్ని మరింత పెంచాలని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ కోరారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని పేరాడ తిలక్ మర్యాదపూర్వకంగా కలిశారు. భావనపాడు పోర్టు విషయంలో భూసేకరణ, పరిహారంలో ఆయా గ్రామాల నిర్వాసితులను ఒప్పించి పోర్టు నిర్మాణానికి మార్గాన్ని సుగుమం చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. అత్యధిక విస్తీర్ణం కలిగిన నందిగాం మండలాన్ని టెక్కలి డివిజన్ పరిధిలో అనుసంధానం చేసే విధంగా చూడాలని కోరారు. ఆయనతో పాటు నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తారు సత్యం, టి.కిరణ్, టీబీజీ గుప్తా, డి.ధర్మారావు, ఎం.సంజీవరావు, చిన్ని జోగారావు తదితరులు ఉన్నారు. అలాగే టెక్కలిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం నిర్మాణానికి స్థలం కేటాయించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. అదేవిధంగా రావివలసలోని మెట్‌కోర్ పరిశ్రమ నుంచి వెలువడే కాలుష్యంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామానికి చెందిన పి.రామయ్య, ఎస్.కుమారి, జనార్ధన్ స్పందనలో ఫిర్యాదు చేశారు. ఇలా పలువురు వ్యక్తుల ఫిర్యాదులను సబ్ కలెక్టర్ స్వీకరించి పరిష్కారించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఆక్రమణలు గుర్తించండి

తహసీల్దార్ కార్యాలయానికి ఆనుకొని ఆక్రమణలు చోటుచేసుకుంటే తక్షణమే గుర్తించాలని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. స్థానిక శాఖా గ్రంథాలయాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ గ్రంథాలయానికి వస్తున్న పాఠకులు, నిరుద్యోగుల వివరాలను తెలుసుకున్నారు. గ్రంథాలయానికి వెనుక భాగంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలపై స్థానికులు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో, తక్షణమే సర్వే నిర్వహించాలని తహసీల్దార్ కిషోర్‌ను ఆదేశించారు. ఆయనతో పాటు వీఆర్‌వోలు చత్రపతి, నేతాజీ తదితరులు ఉన్నారు.

పక్కాగా ఎన్నికల కోడ్

కవిటి: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను పక్కాగా అమలు చేయడం జరుగుతోందని ఎంపీడీవో పి.సూర్యనారాయణ, తహసీల్దార్ రాచర్ల అప్పలరాజు తెలియజేశారు.

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఎన్నికల సంఘం విధించిన నిబంధనలు పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపైనే ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

200 మందికి వైద్య పరీక్షలు

కాశీబుగ్గ: పలాసలోని ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ 10వ వార్షికోత్సవం సందర్భంగా బ్యాంక్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డి.వి.సి.బి డైరెక్టర్లు జేవీ సత్యనారాయణమూర్తి, సీఏ శాస్త్రీలు మాట్లాడుతూ.. వివిధ వర్గాల ప్రజలకు బ్యాంక్ అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. షేర్ హోల్డర్లకు భాగస్వామ్యం చేస్తూ బ్యాంక్ పటిష్టతకు చర్యలు తీసుకుంటున్నామని, భవిష్యత్‌లోను ఇదే రకం సేవలు అందించేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. బ్యాంక్ సభ్యులుగా చేరిన వారికి ఆరోగ్య ఇన్సూరెన్సు అమలు చేస్తున్నామని, ప్రతిభ కనబర్చిన సభ్యుల పిల్లలకు పారితోషకాలు అందిస్తున్నామని తెలిపారు. తమ బ్యాంక్‌లో జీరో బ్యాలెన్స్‌తో ఖాతా ప్రారంభించవచ్చునన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ వజ్జ బాబురావు మాట్లాడుతూ జాతీయ బ్యాంక్‌ల కన్నా డి.వి.సి.బి బ్యాంక్ ఖాతాదారులకు సేవలు అందించడంతో ముందంజలో ఉందన్నారు. బ్యాంక్ జోనల్ మేనేజర్ జి.రమణమూర్తి మాట్లాడుతూ సహకార రంగ బ్యాంకుల్లో డి.వి.సి.బి ఖాతాదారులకు అందుబాటులో ఉంటూ వారి ప్రయోజనాలను కాపాడుతుందని పేర్కొన్నారు. వైద్య శిబిరంలో 200 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ పి.సింహాద్రి, బ్యాంక్ క్యాషియర్ క్రాంతి నాయిక్, దుర్గారావు, భరత్, నేషనల్ కన్జూమర్ కమిషన్ వైస్ చైర్మన్ కుమార్ నాయిక్, పలాస నియోజకవర్గ సీపీఐ నాయకులు చాపర వేణుగోపాల్, డోల లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

● నివాళి



ఇటీవల టర్కీ, సిరియాలో సంభవించిన భూకంపంలో ప్రాణాలు కోల్పోయినవారికి నివాళులర్పిస్తూ పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో సోమవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మద్దిల మల్లేశ్వరరావు, తామాడ సన్యాసిరావు, దుష్యంత్, కై లాష్, శ్రీను, అప్పయ్య, పాపయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. - కాశీబుగ్గ

రైతులు సహకరించాలి

సోంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర భూసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ జి.ఎస్.వి ప్రసాద్ కోరారు. మండలంలోని బెంకిలి సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్న రీసర్వేను సోమవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు తమ పట్టా పాసు పుస్తకాలతో రీసర్వేకు సహకరించాలన్నారు. ప్రతీ రైతుకూ న్యాయం చేయడమే ప్రభుత్వ సదుద్దేశం అన్నారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి సంతోష్, సర్వేయర్ టి.ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సర్వే పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

గావు సంబరాల సందడి

కాశీబుగ్గ: ఆంధ్రా–ఒడిశా సరిహద్దుల్లో ఉన్నటువంటి అనేక ప్రాంతాల్లో పలు కుటుంబాలు గావు సంబరాలు వైభవంగా నిర్వహిస్తాయి. దీంతో సంబరాల కోసం మార్కెట్‌లో పూజా సామాన్ల కొనుగోలులో ఆయా ప్రాంతాల ప్రజలు నిమగ్నమై ఉన్నారు. సంబరాల్లో వినియోగించే కోలలు, రామావతారం, కృష్ణావతారం, నరసింహావతారం పేరుతో పూజచేసే వస్త్రాలకు డిమాండ్ ఏర్పడింది. ఈ గావు సంబరాలను సంక్రాంతి నుంచి శివరాత్రి వరకు మూగజీవాలను పెంచేవారు, యాదవులు అధికంగా జరుపుకుంటారు.

గావు సంబరాల సామాన్లు కొనుగోలు చేస్తున్న దృశ్యం

